# విశాల భారతి
తెలుగు దినపత్రిక

30-03-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 85


## నిధుల కోసం సీఎం చుట్టూ తిరగాలా?

- అభివృద్ధి కేవలం మంత్రుల నియోజకవర్గాలకే పరిమితమని ఆరోపణ
- బడ్జెట్ నిధులన్నీ ఖమ్మం జిల్లాకే తరలిపోతున్నాయని విమర్శ
- సాగునీటి పథకాలు మధిర, హుజూర్‌నగర్‌కే వెళ్తున్నాయని ఆవేదన
- ప్రభుత్వం అంటే కొందరు మంత్రులు మాత్రమే కాదని హెచ్చరిక
- రెండేళ్లుగా నిధుల కొరతతో మనోవేదనకు గురయ్యానని వెల్లడి
- ప్రజల ఆశలు తీర్చలేనప్పుడు పదవిలో కొనసాగడం వేస్ట్ అని వ్యాఖ్య



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సొంత ప్రభుత్వంపైనే యుద్ధం ప్రకటించి రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టించారు. అధికార పక్షంలో ఉంటూనే నిధుల పంపిణీలో జరుగుతున్న అసమానతలను మిగతా 2లో..

## సరదా క్షణం... శాశ్వత విషాదంగా మారింది



05

- నీటి మడుగులో మునిగి ఇద్దరు చిన్నారుల మృతి – సత్తుపల్లిలో విషాదం
- ఈత కొట్టేందుకు వెళ్లి మడుగులో మునిగిన ఇద్దరు బాలురు
- లోతు తెలియక ప్రమాదం – ప్రాణాలు కోల్పోయిన చిన్నారులు
- ఎంటీఆర్ నగర్‌లో విషాద ఛాయలు – కుటుంబాల్లో ఆవేదన



## కేటీఆర్‌తో రేవంత్ రెడ్డి కుమ్మక్కు

- రేవంత్, కేటీఆర్ మధ్య రహస్య డీల్ కుదిరింది
- కేటీఆర్‌ను వదిలేసి హరీష్ రావునే టార్గెట్ చేస్తున్నారు
- లక్ష కోట్లు వదిలి 9 వేల కోట్లపైనే విచారణ ఎందుకు?
- కేటీఆర్, కవితల మధ్య రేవంత్ సంధి కుదుర్చుతున్నారు
- బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదు
- ఇతర రాష్ట్రాలకు రేవంత్ నిధులు పంపుతున్నారు

02

కేసీఆర్, హరీశ్‌రావులపై కేంద్రం చర్యలేవి?
దర్యాప్తును వేగవంతం చేసే ధైర్యం బీజేపీకి ఉందా?
గత ప్రభుత్వ భూ అక్రమాలపై 'హౌస్ కమిటీ'కి రెడీ
మంత్రిని బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ ఆందోళన
బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని రేవంత్ ఆరోపణ

సభలో సూచనలిచ్చి బీజేపీ నేతలు పారిపోతున్నారు



# కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఏమైంది?


**తెలంగాణ శాసనసభ వేదికగా రాజకీయ అగ్నిపర్వతం బద్దలైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో విపక్షాలపై విరుచుకుపడుతూ అసెంబ్లీని హోరెత్తించారు. ప్రధానంగా భారతీయ జనతా పార్టీ ద్వంద్వ వైఖరిని ఎండగడుతూ ఆయన సంధించిన ప్రశ్నలు సభలో వేడిని పుట్టించాయి. ప్రజా సమస్యలపై చర్చించేటప్పుడు సలహాలు ఇచ్చి, ఆ తర్వాత బాధ్యత నుంచి తప్పకుని పారిపోవడం బీజేపీ సభ్యులకు పరిపాటిగా మారిందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి అంశాన్ని ప్రస్తావిస్తూ కేంద్రంలోని పెద్దలకు, ఇక్కడి నేతలకు ఉన్న చిత్తశుద్ధిని ఆయన బహిరంగంగానే శంకించారు.**

విశాలభారతి, స్టేట్ బ్యూరో:గత అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పార్టీకి ఒక ఏటీఎంగా మారిందని బీజేపీ అగ్రనేతలు పదేపదే విమర్శించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. నాటి ఆరోపణలను ఇప్పుడు నిజం చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. విచారణ బాధ్యతలను సీబీఐకి అప్పగిస్తే కేవలం 48 గంటల్లోనే అవినీతి తిమింగలాలను బయటకు లాగుతామని ప్రగల్భాలు పలికిన వారు.. ఇప్పుడు తీరా రాష్ట్ర ప్రభుత్వం విచారణకు సిద్ధపడితే ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుపై చర్యలు తీసుకోవడానికి కేంద్రానికి వచ్చిన అభ్యంతరం ఏమిటని నిలదీశారు. బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి సవాల్ విసురుతూ.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో మాట్లాడి కాళేశ్వరం విచారణను వేగవంతం చేయించే ధైర్యం ఉందా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఢిల్లీలో ఒక మాట, గల్లీలో ఒక మాట మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని హితవు పలికారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే విమర్శలు చేయడం తప్ప, రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చే ఆలోచన విపక్షానికి లేదని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. నిజంగా అవినీతిని అంతం చేయాలనే తపన ఉంటే వెంటనే కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా విచారణ జరిపించి దోషులను జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. ధరణి పోర్టల్ ముసుగులో జరిగిన భూ దందాలపై ముఖ్యమంత్రి సంచలన ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ధరణిని అడ్డుపెట్టుకుని మాజీ మంత్రి హరీశ్‌రావు బంధువులు వేల కోట్ల విలువైన భూములను కబ్జా చేశారని ఆయన ఆరోపించారు. అమాయక రైతుల భూములను లాక్కుని రియల్ ఎస్టేట్ మాఫియాకు ధారాదత్తం చేసిన వైనంపై పూర్తిస్థాయి విచారణ అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ అక్రమాలపై వాస్తవాలను వెలికితీసేందుకు 'హౌస్ కమిటీ' వేయడానికి తమ ప్రభుత్వం ఏమాత్రం వెనుకాడబోదని సభ సాక్షిగా ప్రకటించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న సమయంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సభ్యులు తీవ్ర నిరసనకు దిగారు. మిగతా 3లో..

## శాసనసభలో సస్పెన్షన్ల పర్వం

- బడ్జెట్ సెషన్ ముగిసే వరకు కేటీఆర్, హరీశ్‌రావు సహా అందరూ సస్పెండ్
- రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై 'హౌస్ కమిటీ' కోరుతూ పోడియం వద్ద ఆందోళన
- సభకు అడ్డుపడుతున్నారని శ్రీధర్ బాబు సస్పెన్షన్ తీర్మానం ప్రవేశపెట్టారు
- కేటీఆర్, హరీశ్‌రావు, సబిత ఇంద్రారెడ్డి వంటి కీలక నేతలు సభ నుండి దూరం

03



# అసెంబ్లీలో 'ధరణి' సెగ


## సభను అడ్డుకుంటున్న కేటీఆర్, హరీశ్‌రావుల తీరుపై ఆగ్రహం



- గత హౌస్ కమిటీల నివేదికలు ఏమయ్యాయని ప్రశ్న
- భూ అక్రమాలపై తక్షణమే 'హౌస్ కమిటీ'కి డిమాండ్
- కడియం శ్రీహరి పట్ల ఎమ్మెల్యే తీరుపై దుమారం
- కౌశిక్ రెడ్డిని సభ నుండి పంపేయాలని కాంగ్రెస్ పట్టు
- భూ దోపిడీ వర్సెస్ మంత్రి బర్తరఫ్ డిమాండ్లతో గందరగోళం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ శాసనసభ వేదికగా అధికార, ప్రతిపక్షాల మధ్య సాగుతున్న రాజకీయ యుద్ధం పతాక స్థాయికి చేరింది. అసెంబ్లీలో చోటుచేసుకుంటున్న పరిణామాలు సభా సంప్రదాయాలను సవాల్ చేస్తున్నాయి. ప్రధానంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడటంతో సభలో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారాన్ని అడ్డం పెట్టుకుని సభను స్తంభింపజేయాలని చూడటం భావ్యం కాదని ఆయన హితవు పలికారు. సభా మర్యాదలు, నియమావళిపై కనీస అవగాహన ఉన్న కేటీఆర్, హరీశ్‌రావు వంటి అనుభవజ్ఞులైన నేతలు కూడా గుంపుగా చేరి నిరసన తెలపడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల గురించి చర్చించాల్సిన సమయంలో కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం సభా సమయాన్ని వృధా చేస్తున్నారంటూ మండిపడ్డారు. మిగతా 3లో..



మంచిర్యాల జిల్లా ముధిగుంట గ్రామ ఇంకుడు గుంతలపై ప్రశంసలు

త్రిపుర, ఛత్తీస్‌గఢ్ రైతుల నీటి పరిరక్షణ పద్ధతులపై కొనియాడారు

## ప్రజలు ఐక్యంగా ఉండాలి

- పశ్చిమాసియా యుద్ధ సవాళ్లను భారతీయులు ఐక్యంగా ఎదుర్కొంటారు
- పెట్రోల్, డీజిల్ కొరతపై వచ్చే అబద్ధపు ప్రచారాలు నమ్మొద్దు
- కోటి మంది భారతీయులకు అండగా ఉన్నందుకు కృతజ్ఞతలు

02


### వర్షపు నీటిని పొదుపు చేయాలని, 'అమృత్ సరోవర్' లక్ష్యమని వెల్లడి

## పొంగులేటి దోపిడీలో రేవంత్ వాటా ఎంత?

- అక్రమాలపై మంత్రి పదవికి పొంగులేటి రాజీనామా చేయాలి
- మంత్రి చేస్తున్న దోపిడీలో సీఎం వాటా ఎంతో చెప్పాలి
- మంత్రుల అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
- ఎల్అండ్‌టీ అప్పును ప్రజలపై రుద్దేందుకు ప్రభుత్వం యత్నం
- కోకాపేట్ భూముల కోసం 'దండుపాళ్యం ముఠా' కుట్ర
- మైనింగ్ మాఫియాకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది

04





# సౌదీ ఎయిర్‌బేస్‌పై ఇరాన్ భీకర దాడి

- సౌదీలోని యూఎస్ ఎయిర్‌బేస్‌పై ఇరాన్ క్షిపణి వర్షం.
- అమెరికాకు చెందిన ఏడబ్ల్యూఏసీఎస్ నిఘా విమానం ముక్కలు
- 6 బాలిస్టిక్ క్షిపణులు, 29 డ్రోన్లతో విరుచుకుపడ్డ ఇరాన్
- ఈ దాడిలో 10 మంది అమెరికా సిబ్బందికి తీవ్ర గాయాలు
- తమ నేతల హత్యకు బదులుగా ఇరాన్ భీకర దాడులు
- ఇజ్రాయెల్, అమెరికా లక్ష్యంగా యుద్ధం మరింత తీవ్రం

**విశాలభారతి, అంతర్జాతీయం:**

మధ్యప్రాచ్య ప్రాంతంలో యుద్ధ మేఘాలు నిమిషనిమిషానికి మరింత సాంద్రతను సంతరించుకుంటున్నాయి. సౌదీ అరేబియా భూభాగంలోని ఒక కీలకమైన అమెరికన్ ఎయిర్‌బేస్ లక్ష్యంగా ఇరాన్ సైన్యం ప్రతీకార దాడులకు దిగడంతో అంతర్జాతీయ సమాజం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ భీకర దాడుల ధాటికి అమెరికా వైమానిక దళానికి గుండెకాయ వంటి మిగతా 2లో..

## పొంగులేటిని కాపాడేందుకే రేవంత్ ప్లాన్

- పొంగులేటిని రక్షించడానికే ప్రభుత్వం సీబీసీఐడి విచారణ వేసింది
- తన కింద పనిచేసే పోలీసులు మంత్రి తప్పును బయటపెట్టలేరు
- అసెంబ్లీలో అక్రమాలను దాచబోయి ప్రభుత్వం అడ్డంగా దొరికిపోయింది
- మంత్రి కంపెనీకి నోటీసులు వచ్చినా టిష్యూ పేపర్‌లా పడేశారు
- అక్రమ మైనింగ్ వల్ల ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల నష్టం
- నిజాయితీ ఉంటే అసెంబ్లీ కమిటీతో విచారణ జరిపించాలని సవాల్

02



# ప్రజలు ఐక్యంగా ఉండాలి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం వల్ల తలెత్తే ఎలాంటి పరిస్థితులనైనా 140 కోట్ల మంది భారతీయులు ఒకేతాటిపై నిలిచి ఎదుర్కోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. ప్రస్తుత కాలం నిస్సందేహంగా సవాల్‌తో కూడుకున్నదని, భారతీయులంతా మరోసారి సమైక్యతను చాటి ఈ క్లిష్ట సమయాన్ని అధిగమించాలని కోరారు. సంక్లిష్ట తరుణంలో దేశ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, బాధ్యతారాహిత్యంగా ప్రచారమయ్యే వదంతులను అస్సలు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ అంశంపై రాజకీయాలు తావులేదని, వదంతుల వ్యాప్తి చేయడం వల్ల సమాజానికి కీడు జరుగుతుందని హెచ్చరించారు. ఆదివారం నిర్వహించిన 132వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగంగా మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. పశ్చిమాసియా ప్రాంతం ప్రపంచ ఇంధన అవసరాలకు ప్రధాన వనరుగా ఉందని, అక్కడ జరుగుతున్న పోరాటం వల్ల అంతర్జాతీయంగా పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రధాని వివరించారు. ప్రపంచ దేశాలతో భారత్ కలిగి ఉన్న బలమైన దౌత్య సంబంధాల కారణంగానే ఇలాంటి సవాళ్లను నిబద్ధతతో ఎదుర్కోగలుగుతున్నామని భరోసా ఇచ్చారు. గత కొన్ని దశాబ్దాలుగా నిర్మించుకున్న అంతర్జాతీయ మైత్రి ఇప్పుడు దేశానికి రక్షణ కవచంలా నిలుస్తోందని పేర్కొన్నారు. స్వార్థపూరిత రాజకీయ ప్రయోజనాల కోసం దేశ సమగ్రతను దెబ్బతీసే చర్యలకు ఎవరూ పాల్పడకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వ అధికారిక యంత్రాంగం ఇచ్చే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. భారతదేశానికి భౌగోళికంగా సమీపంలోనే గత నెల రోజులుగా భీకర పోరు సాగుతుండటంపై ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశంలోని లక్షలాది కుటుంబాలకు చెందిన సభ్యులు ఆయా పశ్చిమాసియా దేశాల్లో నివసిస్తున్నారని గుర్తు చేశారు. ముఖ్యంగా గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్న కోటి మందికి పైగా భారతీయుల భద్రత తమకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని చెప్పారు. అక్కడి భారతీయులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్న గల్ఫ్ దేశాల ప్రభుత్వాలకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రవాస భారతీయుల యోగక్షేమాల విషయంలో ప్రభుత్వం నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని, అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ప్రధాని దేశ ప్రజలకు వివరించారు.

పర్యావరణ పరిరక్షణలో భాగంగా నీటిని పొదుపు చేయాల్సిన ఆవశ్యకతను మోదీ నొక్కి చెప్పారు. జల సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, అది ప్రతి భారతీయుడి సంకల్పం కావాలని పిలుపునిచ్చారు. 11 ఏళ్ల క్రితం ప్రారంభించిన జల పరిరక్షణ ఉద్యమం ఇప్పుడు దేశవ్యాప్తంగా అద్భుతమైన ఫలితాలను ఇస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా నీటి నిల్వకు ఉపయోగపడే సుమారు 50 లక్షల కొత్త నిర్మాణాలు అందుబాటులోకి రావడం గొప్ప పరిణామమని కొనియాడారు. అమృత్ సరోవర్ పథకం ద్వారా 70 వేల కొత్త జల వనరులను నిర్మించుకోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో నీటి కష్టాలు తీరుతున్నాయని చెప్పారు. ప్రజా భాగస్వామ్యం వల్లే పాత చెరువులకు పునర్జీవం లభించిందని ప్రధాని గుర్తు చేశారు. త్రిపురలోని జంపుయి పర్వత శ్రేణుల్లో ఉన్న వాంగ్మున్ గ్రామం జల సంరక్షణలో దేశానికే ఆదర్శంగా నిలిచిందని ప్రధాని ప్రశంసించారు. సముద్ర మట్టానికి 3 వేల అడుగుల ఎత్తులో ఉన్న ఆ గ్రామం గతంలో తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొనేదని వివరించారు. వేసవి వచ్చిందంటే చాలు మైళ్ల దూరం వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నుంచి ఆ గ్రామస్తులు తమను తాము కాపాడుకున్న తీరు అద్భుతమని చెప్పారు. ప్రతి ఇంటి పైకప్పుపై వర్షపు నీటిని ఒడిసిపట్టే రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ విధానాన్ని అమలు చేయడం వల్ల ఇప్పుడు అక్కడ నీటి కొరత అన్నదే లేదని తెలిపారు. ఆ పర్వత ప్రాంత ప్రజల పట్టుదల వల్లే ప్రకృతి ప్రసాదించిన ప్రతి నీటి బొట్టును భూమిలోకి పంపడం సాధ్యమైందని కొనియాడారు.

ఛత్తీస్‌గఢ్‌లోని కోరియా జిల్లా రైతులు తమ పొలాల్లో చిన్నపాటి చెరువులు, ఇంకుడు గుంతలు తవ్వుకుని భూగర్భ జలాలను పెంచుకున్న వైనాన్ని మోదీ ఉదహరించారు. వర్షాకాలంలో వృథాగా పోయే నీటిని నిల్వ చేయడం వల్ల ఆ ప్రాంతంలో సాగునీటి లభ్యత పెరిగిందని చెప్పారు. ఒక రైతు మొదలుపెట్టిన ఈ వినూత్న ప్రయోగం ఇప్పుడు 1,200 మంది రైతులకు విస్తరించిందని తెలిపారు. రైతులు తమ సొంత కృషితో భూగర్భ జలమట్టాన్ని పెంచుకోవడం వల్ల పంటల దిగుబడి కూడా మెరుగుపడిందని ప్రధాని వివరించారు. ఈ తరహా ప్రయత్నాలు దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని రైతులు చేపడితే కరువు అనే మాటే వినపడదని ఆశాభావం వ్యక్తం చేశారు. సాగునీటి రంగంలో స్వయం సమృద్ధి సాధించడానికి జల పరిరక్షణే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. తెలంగాణలోని మంచిర్యాల జిల్లా ముధిగుంట గ్రామం పరిశుభ్రత, జల సంరక్షణలో విశేష కృషి చేస్తోందని ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆ గ్రామంలోని 400 కుటుంబాలు తమ ఇళ్ల ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలను నిర్మించుకోవడం వల్ల ఊరంతా భూగర్భ జలాలు పుష్కలంగా లభిస్తున్నాయని చెప్పారు. కేవలం నీటి లభ్యతే కాకుండా, మురుగునీరు నిల్వ ఉండకుండా చూడటం వల్ల గ్రామంలో వ్యాధుల ముప్పు కూడా గణనీయంగా తగ్గిందని అభినందించారు. ముధిగుంట గ్రామ ప్రజల ఐక్యత, చొరవ ఇతర గ్రామాలకూ మార్గదర్శకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పర్యావరణ హితమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా సమాజంలో పెద్ద మార్పు తీసుకురావచ్చని ఈ గ్రామం నిరూపించిందని ప్రధాని కొనియాడారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో దేశీయంగా ఆర్థిక క్రమశిక్షణ, వనరుల పొదుపు చాలా అవసరమని మోదీ అభిప్రాయపడ్డారు. పశ్చిమాసియా సంక్షోభం వల్ల ఇంధన ధరల మీద ప్రభావం పడకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ, ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఇంధన పొదుపు, జల సంరక్షణ వంటి అంశాలు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయని చెప్పారు. అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే క్రమంలో భారత్ ఇలాంటి అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని, అందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. యువత ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఇలాంటి సమస్యలకు పరిష్కారాలను అన్వేషించాలని సూచించారు. దేశ ప్రయోజనాలే పరమావధిగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షించారు. వదంతులు వ్యాప్తి చేసే వారిపై కఠినంగా ఉండాలని, సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారాన్ని విచక్షణతో గమనించాలని ప్రధాని కోరారు. యుద్ధం వంటి సున్నితమైన అంశాల్లో అవగాహన లేని వ్యాఖ్యలు చేయడం వల్ల దేశ ప్రతిష్ఠ దెబ్బతింటుందని హెచ్చరించారు. భారతదేశం ఎప్పుడూ శాంతినే కోరుకుంటుందని, అయితే మన ప్రయోజనాల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ గళం ఇప్పుడు బలంగా వినిపిస్తోందని, దానికి కారణం దేశ ప్రజలు అందిస్తున్న మద్దతేనని చెప్పారు. క్లిష్ట పరిస్థితుల్లో కూడా ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉండటం మన బలమని పేర్కొన్నారు. ప్రజలంతా ప్రభుత్వానికి సహకరిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న చిన్న మార్పుల ద్వారా పెద్ద ఫలితాలు సాధించవచ్చని మోదీ పేర్కొన్నారు. చెరువుల పూడిక తీత కార్యక్రమాలను వర్షాకాలం కంటే ముందే పూర్తి చేసుకోవాలని అధికారులను, స్వచ్ఛంద సంస్థలను కోరారు. వర్షపు నీరు ఒక్క చుక్క కూడా వృథా కాకుండా భూమిలోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నీటి సంరక్షణ అనేది రాబోయే తరాలకు మనం ఇచ్చే గొప్ప ఆస్తి అని అభివర్ణించారు. ముధిగుంట, వాంగ్మున్ వంటి గ్రామాలు సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి పంచాయతీ జలశక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా అమృత్ సరోవర్ల నిర్మాణం వేగంగా పూర్తి కావాలని ఆకాంక్షించారు. నీటి పొదుపుపై అవగాహన పెంచడానికి పాఠశాలలు, కళాశాలలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

## సౌదీ ఎయిర్‌బేస్‌పై ఇరాన్ భీకర దాడి

మొదటిపేజీ తరువాయి



అత్యంత ఖరీదైన 'E3 అవాక్స్' కమాండ్ అండ్ కంట్రోల్ విమానం నిలువునా ఛిద్రమైపోయింది. ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్‌బేస్‌పై ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు పెను విధ్వంసాన్ని సృష్టించాయి. అగ్రరాజ్యం సైనిక ఆస్తులకు తీరని నష్టం వాటిల్లిందని ఇరాన్ అధికారిక వర్గాలు ధీమాగా ప్రకటిస్తున్నాయి. ఇరాన్‌కు చెందిన ప్రెస్ టీవీ విడుదల చేసిన దృశ్యాలు ఈ దాడి తీవ్రతను కళ్లకు కడుతున్నాయి. అత్యాధునిక సాంకేతికతతో నిండిన అవాక్స్ విమానం మధ్యభాగం పూర్తిగా ధ్వంసమై ఉండటాన్ని ఆ చిత్రాల్లో స్పష్టంగా గమనించవచ్చు. విమానం తల, తోక భాగాలు మాత్రమే మిగిలి ఉండటం చూస్తుంటే ఇరాన్ క్షిపణులు ఎంతటి కచ్చితత్వంతో లక్ష్యాన్ని తాకాయో అర్థమవుతోంది. కేవలం అవాక్స్ విమానమే కాకుండా, అక్కడ నిలిపి ఉంచిన ఇతర యుద్ధ విమానాలు, రవాణా వాహనాలు కూడా ఈ దాడి ప్రభావానికి లోనయ్యాయి. అమెరికా గూఢచార వ్యవస్థకు ఇది కోలుకోలేని దెబ్బగా రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ మెరుపు దాడి కోసం ఇరాన్ భారీ స్థాయిలో అత్యాధునిక ఆయుధాలను రంగంలోకి దించింది. ఏకకాలంలో ఆరు శక్తివంతమైన బాలిస్టిక్ క్షిపణులతో పాటు 29 ఆత్మాహుతి డ్రోన్లను ఎయిర్‌బేస్‌పైకి ప్రయోగించింది. రక్షణ కవచాలను ఛేదించుకుంటూ వెళ్ళిన ఈ ఆయుధాలు ఎయిర్‌బేస్‌లోని కీలక విభాగాలను ధ్వంసం చేశాయి. ఈ దాడిలో సుమారు 10 మంది అమెరికా సైనికులు తీవ్రంగా గాయపడినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని తెలుస్తోంది. అమెరికా సెంట్రల్ కమాండ్ ఈ ఘటనపై ఇంకా అధికారికంగా నోరు మెదపకపోవడం గమనార్హం. ఎయిర్‌బేస్‌లోని రీఫ్యూయలింగ్ విమానాలపై కూడా ఇరాన్ విరుచుకుపడింది. గాలిలోనే యుద్ధ విమానాలకు ఇంధనాన్ని నింపే ఈ వాహనాలు దెబ్బతినడంతో అమెరికా వైమానిక కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉంది. దీనికి అదనంగా ఒక అమెరికన్ MQ9 డ్రోన్‌ను విజయవంతంగా కూల్చివేశామని, ఒక F16 యుద్ధ విమానాన్ని కూడా దెబ్బతీశామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. అమెరికా, ఇజ్రాయెల్ కూటమికి గట్టి గుణపాఠం చెప్పడమే లక్ష్యంగా తాము ఈ దాడులు చేసినట్లు ఇరాన్ స్పష్టం చేసింది. మధ్యప్రాచ్యంలో ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని తక్కువ అంచనా వేయవద్దని హెచ్చరికలు జారీ చేసింది. గత నెల రోజులుగా కొనసాగుతున్న ఈ ఉద్రిక్తతలు ఇప్పుడు రెండో నెలలోకి ప్రవేశించి భీకర రూపం దాల్చాయి. ఫిబ్రవరి చివరలో అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఇరాన్‌పై దాడులు ప్రారంభించినప్పటి నుండి ఇరు పక్షాల మధ్య పోరు తీవ్రమైంది. ఇరాన్ అగ్రశ్రేణి నాయకులు అయతుల్లా అలీ ఖమేనీ, అలీ లారీజానీలను అమెరికా కూటమి హతమార్చడం ఇరాన్‌ను తీవ్రంగా కలిచివేసింది. తమ నాయకుల మరణానికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ అప్పట్లోనే శపథం చేసింది. ఇప్పుడు చేస్తున్న దాడులన్నీ ఆ ప్రతీకార చర్యల్లో భాగమేనని ఇరాన్ సైనిక వర్గాలు పేర్కొంటున్నాయి. యుద్ధం కారణంగా పౌర మౌలిక సదుపాయాలు కూడా భారీగా దెబ్బతింటున్నాయి. అమెరికా కూటమి ప్రయోగించిన క్షిపణులు మినాబ్‌లోని ఒక బాలికల పాఠశాలపై పడటంతో 180 మంది అమాయక విద్యార్థినులు మరణించడం అంతర్జాతీయంగా కలకలం రేపింది. ఈ విషాద ఘటన ఇరాన్ ప్రజల్లో అమెరికా పట్ల తీవ్ర ఆగ్రహాన్ని రగిల్చింది. తమ విద్యాసంస్థలపై దాడులు చేస్తే ఊరుకునేది లేదని, అమెరికా, ఇజ్రాయెల్ విశ్వవిద్యాలయాలను లక్ష్యంగా చేసుకుంటామని టెహ్రాన్ హెచ్చరించింది. అమాయక ప్రాణాలు బలికావడంతో ఇరాన్ ప్రభుత్వం తన దాడుల తీవ్రతను మరింత పెంచాలని నిర్ణయించింది. ఈ యుద్ధ జ్వాలలు ఇప్పుడు యెమెన్ వరకు విస్తరించాయి. ఇరాన్ మద్దతు ఉన్న హౌతీ తిరుగుబాటుదారులు కూడా ఈ పోరులో భాగస్వాములయ్యారు. ఇజ్రాయెల్ భూభాగంపై హౌతీలు క్షిపణి దాడులకు దిగడంతో యుద్ధం బహుముఖ రూపం దాల్చింది. ఇది కేవలం రెండు దేశాల మధ్య పోరుగా కాకుండా మొత్తం ప్రాంతీయ సంక్షోభంగా మారుతోంది. గల్ఫ్ దేశాలన్నీ ఈ పరిణామాలను ఆందోళనతో గమనిస్తున్నాయి. యుద్ధం మరింత కాలం కొనసాగితే చమురు సరఫరా వ్యవస్థ దెబ్బతిని ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

# 'కేటీఆర్‌తో రేవంత్ రెడ్డి కుమ్మక్కు'

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇద్దరూ ఒక్కటేనని, వారిద్దరి మధ్య కుదిరిన కుమ్మక్కు రాజకీయాల వల్లే అవినీతి కేసుల విచారణ నత్తనడకన సాగుతోందని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, రాష్ట్ర ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. కేటీఆర్‌పై ఉన్న డ్రగ్స్, ఫాంహౌజ్ వంటి కీలక కేసుల జోలికి వెళ్లకుండా రేవంత్ రెడ్డి కేవలం హరీష్ రావును మాత్రమే లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లక్ష కోట్ల రూపాయల భారీ అవినీతిని పక్కన పెట్టి, కేవలం కొన్ని విభాగాలకే విచారణను పరిమితం చేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వద్ద జరిగిన రూ. 9 వేల కోట్ల అవినీతిపైనే సీఎం రేవంత్ రెడ్డి సీబీఐ విచారణ కోరడం వెనుక అసలు ఉద్దేశం హరీష్‌రావును ఇరికించడమేనని బండి సంజయ్ విశ్లేషించారు. ప్రాజెక్టు మొత్తం నిర్మాణంలో జరిగిన లక్ష కోట్ల వ్యత్యాసాలపై విచారణ జరిపితే కేసీఆర్ కుటుంబం మొత్తం బయటపడుతుందనే భయంతోనే ప్రభుత్వం వెనకడుగు వేస్తోందని దుయ్యబట్టారు. గతంలో తనను జైలుకు పంపిన కేసీఆర్ కుటుంబంపై రేవంత్‌కు ఇప్పుడు కోపం పోయిందని, వారి మధ్య 'డీల్' కుదిరినందునే పౌరుషం వదిలేసి స్నేహహస్తం అందిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్, కవితల మధ్య విభేదాలను తొలగించి సయోధ్య కుదిర్చేందుకు ముఖ్యమంత్రి మధ్యవర్తిత్వం వహిస్తున్నారని వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌తో కలిసి భవిష్యత్తులో ఎన్నికలకు వెళ్లాలని యోచిస్తోందని సంజయ్ అనుమానం వ్యక్తం చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన మైనింగ్ స్కామ్‌లు, ఇతర అవినీతి అక్రమాలపై ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలన్నీ కేవలం బెదిరింపులకే పరిమితమని కొట్టిపారేశారు. "మీరు గతంలో దోచుకున్నారు.. ఇప్పుడు మేము దోచుకుంటాం.. మా జోలికి రావద్దు" అనే సంకేతాలను పంపడానికే ఈ నామమాత్రపు విచారణలు సాగుతున్నాయని విమర్శించారు. కేటీఆర్ రాష్ట్రంలోనే అతిపెద్ద అవినీతిపరుడని తెలిసినప్పటికీ, ఆయనను కాపాడాల్సిన అవసరం ముఖ్యమంత్రికి ఏముందని ప్రశ్నించారు. ఈ పరిణామాల నేపథ్యంలో హరీష్ రావు తన రాజకీయ భవిష్యత్తుపై ఆలోచించుకోవాలని, రేవంత్‌కేటీఆర్ బంధాన్ని గమనించాలని సూచించారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్య పొత్తు పొడుస్తుందనే ప్రచారాన్ని బండి సంజయ్ తీవ్రంగా ఖండించారు. కుటుంబ పాలనను ప్రోత్సహించే పార్టీలతో బీజేపీకి ఎప్పటికీ పొత్తు ఉండదని స్పష్టం చేశారు. కేసీఆర్ కుటుంబ అవినీతిని అంతం చేయడమే లక్ష్యంగా బీజేపీ పోరాడిందని, ఆ క్రమంలోనే వారిని గద్దె దించామని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకమని, రాజకీయ కుటుంబాల వారికి టిక్కెట్లు ఇవ్వబోమని ఇప్పటికే తేల్చి చెప్పారని వివరించారు. అటువంటప్పుడు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రాంతీయ పార్టీలతో కలిసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే బీజేపీపై అసత్య ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు.

దేశవ్యాప్తంగా జరగనున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు బీజేపీకి పూర్తి అనుకూలంగా ఉండబోతున్నాయని సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఏ ఒక్క రాష్ట్రంలోనూ విజయం సాధించే పరిస్థితి లేదని, అస్సాం, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో బీజేపీ జెండా ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళలోనూ ఎన్డీయే కూటమికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని సర్వేలు చెబుతున్నాయని పేర్కొన్నారు. తాను స్వయంగా అస్సాం పర్యటనకు వెళ్లినప్పుడు ప్రజల నుంచి అద్భుతమైన స్పందన లభించిందని, మోదీ నాయకత్వమే దేశానికి శ్రీరామరక్ష అని ప్రజలు నమ్ముతున్నారని వెల్లడించారు. దక్షిణాది, ఉత్తరాది అనే బేధం లేకుండా దేశంలోని అన్ని ప్రాంతాలను బీజేపీ సమానంగా చూస్తుందని బండి సంజయ్ స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన, 33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలు వంటి అంశాల ప్రస్తావన రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో ఆందోళన మొదలైందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు ఒక క్రమపద్ధతిలో సాగుతాయని, దీనిపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలు అర్థరహితమని కొట్టిపారేశారు. ఇతర రాష్ట్రాల ఎన్నికల కోసం తెలంగాణ నుంచి రేవంత్ రెడ్డి నిధులు సమకూరుస్తున్నారని సంచలన ఆరోపణ చేశారు. ప్రస్తుతం కర్ణాటక నుంచి డీకే శివకుమార్ డబ్బులు పంపే పరిస్థితి లేకపోవడంతో, ఆ భారం రేవంత్ రెడ్డిపై పడిందని వ్యాఖ్యానించారు. తెలంగాణ సమాజం రేవంత్ రెడ్డి సర్కార్ తీరును గమనిస్తోందని, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన ప్రభుత్వం ఇప్పుడు డ్రామాలాడుతోందని బండి సంజయ్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించకుండా కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో జరిగిన ప్రతి పైసా అవినీతిని వెలికితీయాలని, అది కాకుండా కేవలం ఒక వ్యక్తిని టార్గెట్ చేయడం వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని హితవు పలికారు. రేవంత్ రెడ్డికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే కేటీఆర్, కేసీఆర్ లపై ఉన్న కేసుల విచారణను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.

# పొంగులేటిని కాపాడేందుకే రేవంత్ ప్లాన్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సంబంధించిన కంపెనీ అక్రమ మైనింగ్‌కు పాల్పడిందనే ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంత్రి తప్పు చేశారని ఆయన కింద పనిచేసే పోలీసు అధికారులు నివేదిక ఇచ్చే పరిస్థితి ఎక్కడైనా ఉంటుందా అని నిలదీశారు. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ అంశంపై సుదీర్ఘంగా మాట్లాడారు. కేవలం తన మంత్రిని కాపాడుకోవడానికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీబీసీఐడీ విచారణకు ఆదేశించారని ఆరోపించారు. ప్రభుత్వం తప్పును కప్పిపుచ్చుకునే క్రమంలో అసెంబ్లీ వేదికగా అనేక అబద్ధాలు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. మంత్రి కంపెనీ అవినీతికి పాల్పడిందని స్వయంగా ముఖ్యమంత్రి, సంబంధిత శాఖా మంత్రులు ఒప్పుకున్న విషయాన్ని హరీశ్‌రావు గుర్తు చేశారు. ప్రభుత్వం భాగస్వామిగా ఉన్న సమయంలో మంత్రిపై విచారణను ప్రభుత్వ విభాగమైన సీబీసీఐడీకి అప్పగించడం అంటే కేసును నీరుగార్చడమేనని అభిప్రాయపడ్డారు. దేశ చరిత్రలో ఎక్కడైనా ఒక మంత్రి అవినీతి చేస్తే ఆయన ఆధీనంలోని పోలీసు యంత్రాంగం నిష్పక్షపాతంగా నివేదికలు ఇవ్వడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. అందుకే తక్షణమే మంత్రిని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అప్పుడే విచారణ పారదర్శకంగా జరుగుతుందని, లేనిపక్షంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని లేదా అసెంబ్లీలో హౌస్ కమిటీ వేయాలని హరీశ్‌రావు గట్టిగా కోరారు.

కేంద్రంలో అదానీ కుంభకోణాల మీద జాయింట్ పార్లమెంట్ కమిటీ వేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తారని, మరి ఇక్కడ హౌస్ కమిటీ వేయడానికి ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ పార్టీయే ఓబులాపురం మైనింగ్ కంపెనీ మీద హౌస్ కమిటీ వేసిన ఉదంతాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పుడు భయపడటానికి కారణం ఏంటని నిలదీస్తూ, నిజంగా చిత్తశుద్ధి ఉంటే విచారణకు సహకరించాలని సూచించారు. తాము ఆధారాలతో సహా స్కామ్‌ను బయటపెడితే, ప్రభుత్వం దొరికిపోయిన దొంగలా ప్రవర్తిస్తోందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి అబద్ధాలను కప్పిపుచ్చుకునే క్రమంలో సభలో పది రకాల తప్పులు మాట్లాడారని హరీశ్‌రావు పేర్కొన్నారు.

కాంట్రాక్టర్ల బిల్లుల్లో సీనరేజ్ చార్జీలు ఆటోమేటిక్‌గా కట్ అవుతాయని, దానికీ అక్రమ మైనింగ్‌కూ సంబంధం లేదని హరీశ్‌రావు వివరించారు. అక్రమ మైనింగ్‌కు పెనాల్టీలు వేయడం వేరని, సీనరేజ్ చార్జీలు కట్టడం వేరని స్పష్టం చేశారు. మైనింగ్ శాఖ ఇప్పటికే మంత్రికి రెండు షోకాజ్ నోటీసులు జారీ చేసిందని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు లేఖలు రాసిందని వెల్లడించారు. ప్రభుత్వం చెబుతున్నట్లుగా రికవరీ జరిగి ఉంటే ఆ వివరాలను బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. మంత్రికి ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఆయన లెక్క చేయలేదని, వాటిని టిష్యూ పేపర్లుగా భావించి పక్కన పడేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం రెండోసారి తప్పు చేసిన కంపెనీలకు ఏడాది జైలు శిక్ష విధించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. మంత్రిపై చర్యలు తీసుకోకుండా రికవరీ చేశామని బుకాయించడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. ఒక అబద్ధాన్ని దాచబోయి వంద అబద్ధాలు ఆడుతూ ప్రభుత్వం అసెంబ్లీలో రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిందని విమర్శించారు. ఒక కంపెనీ కోసం హౌస్ కమిటీ వేయవచ్చా అని కొందరు మంత్రులు అడగడం హాస్యాస్పదంగా ఉందని, గతంలో ఓఎంసీ కోసం వేసినప్పుడు ఆ నియమం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. విద్యుత్ మీటర్ల కొరత పేరుతో డీజిల్ జనరేటర్లను అనుమతించామని చెప్పడం విడ్డూరంగా ఉందని, అనుమతులు లేని కారణంగానే అక్రమ క్రషింగ్ కోసం జనరేటర్లు వాడుతున్నారని ఆధారాలతో సహా వివరించారు. వందల కంపెనీలకు విద్యుత్ కట్ చేసినా, మంత్రి కంపెనీకి మాత్రం రాయితీలు ఇస్తున్నారని ఆరోపించారు. మొదటి డిమాండ్ నోటీసులోనే 28 లక్షల రూపాయల పెనాల్టీ కట్టమని మైనింగ్ శాఖ స్పష్టంగా పేర్కొందని హరీశ్‌రావు పత్రాలను చూపారు. రెండోసారి తనిఖీలో 11 వేల మెట్రిక్ టన్నుల మెటల్ దొరికినందున కోటి రూపాయల పెనాల్టీ పడుతుందని తెలిపారు. గత రెండున్నర ఏళ్లుగా సాగిన ఈ అక్రమ వ్యవహారంలో వందల కోట్ల రూపాయల రాష్ట్ర ఖజానాకు గండి పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పత్రికలో వచ్చిన కథనం ఆధారంగా మాట్లాడుతున్నామని మంత్రులు అంటున్నారని, కానీ అది ప్రభుత్వ అనుకూల పత్రికలోనే వచ్చిందని గుర్తు చేశారు. తాను కేవలం ఆరోపణలు చేయడం లేదని, పక్కా ఆధారాలు సేకరించిన తర్వాతే మాట్లాడుతున్నానని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అన్ని ఫిర్యాదులపై స్పందించాలని, ఇప్పటివరకు 50 ఫిర్యాదులు ఇచ్చినా పట్టించుకోవడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పొంగులేటి కుటుంబ సభ్యులకు ఆ కంపెనీతో సంబంధం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తప్పు నుంచి తప్పించుకోవడానికి తనపై వ్యక్తిగత దాడులు చేస్తున్నారని, కౌశిక్ రెడ్డి వంటి వారిపై ఎథిక్స్ కమిటీల పేరుతో వేధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. దళితులపై ప్రేమ ఉన్నట్లు గంటల తరబడి ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ అసలు విషయాన్ని పక్కదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలను మానుకొని అక్రమ మైనింగ్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మైనింగ్ అజెండాలోనే లేదని కొందరు మంత్రులు అనడం వారి అజ్ఞానానికి నిదర్శనమని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పరిశ్రమల శాఖ పరిధిలోనే మైనింగ్ ఉంటుందన్న కనీస అవగాహన కూడా లేకుండా మంత్రులు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సైతం ఈ వ్యవహారంపై స్పష్టత ఇవ్వలేక తడబడుతున్నారని పేర్కొన్నారు.

# నిధుల కోసం సీఎం చుట్టూ తిరగాలా?

మొదటిపేజీ తరువాయి

ఎండగట్టడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అభివృద్ధి ఫలాలు కేవలం మంత్రుల నియోజకవర్గాలకే పరిమితమవుతున్నాయని, సామాన్య ఎమ్మెల్యేల పరిధిలోని ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆయన చేసిన విమర్శలు పాలనా యంత్రాంగంలోని లోపాలను వేలెత్తి చూపుతున్నాయి. ప్రభుత్వం అంటే కేవలం కొందరు మంత్రుల కలయిక మాత్రమే కాదని, అందరినీ సమానంగా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులు, నిధుల విడుదల విషయంలో ఖమ్మం జిల్లాకు పెద్దపీట వేస్తున్నారనే ప్రచారం క్షేత్రస్థాయిలో బలంగా ఉందని రాజగోపాల్‌రెడ్డి కుండబద్దలు కొట్టారు. ఆ జిల్లా నుంచి ముగ్గురు కీలక మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తుండటంతో అటూ వైపే నిధుల వరద పారుతోందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల పరిస్థితిని విస్మరించి, కేవలం కొన్ని వర్గాల ప్రయోజనాల కోసమే నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ తరహా వివక్ష వల్ల ప్రజాప్రతినిధులుగా తమకు ఓట్లేసిన ప్రజలకు ముఖం చూపించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌ను ఏ విధంగానైతే అభివృద్ధి పథంలో నడిపించాలని తపిస్తారో, అదే ఆకాంక్ష ప్రతి ఎమ్మెల్యేకు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మునుగోడు నియోజకవర్గ ప్రజలు తనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వారి కలలను నిజం చేయలేనప్పుడు ఈ పదవిలో కొనసాగడం నిరర్థకమని వ్యాఖ్యానించారు. నిధుల కోసం మంత్రుల చుట్టూ, ముఖ్యమంత్రి చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి రావడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. పరిపాలన అనేది కేంద్రీకృతం కాకుండా వికేంద్రీకరణ పద్ధతిలో సాగాలని ఆయన డిమాండ్ చేశారు. మధిర, హుజూర్‌నగర్ వంటి నియోజకవర్గాలకే సాగునీటి ప్రాజెక్టులు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు తరలిపోతున్నాయని రాజగోపాల్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వెనుకబడిన ప్రాంతాల అవసరాలను పక్కనపెట్టి, కేవలం రాజకీయ పరపతి ఉన్న ప్రాంతాలకే ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ప్రాంతీయ అసమానతలు మరింత పెరుగుతాయని హెచ్చరించారు. తన నియోజకవర్గంలోని రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన నిధులు విడుదల కాకపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. క్షేత్రస్థాయిలో ప్రజల అవసరాలు గుర్తించకుండా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని సూచించారు. గత రెండున్నరేళ్లుగా నిధుల కొరతతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నానని రాజగోపాల్‌రెడ్డి బహిరంగంగానే వెల్లడించారు. అభివృద్ధి పనులు కుంటుపడటం వల్ల నియోజకవర్గంలో కేడర్‌కు సమాధానం చెప్పలేకపోతున్నానని, ప్రజల నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నానని అన్నారు. ఇన్నాళ్లూ సంయమనంతో ఉన్నప్పటికీ, ఇక ఓపిక నశించి వాస్తవాలను బయటపెట్టక తప్పడం లేదని చెప్పారు. ఇది కేవలం ఒక ఎమ్మెల్యే ఆవేదన మాత్రమే కాదని, అధికార పార్టీలోని చాలా మంది అంతర్గతంగా అనుభవిస్తున్న బాధేనని ఆయన మాటల ద్వారా వ్యక్తమవుతోంది. ప్రభుత్వ విధానాల వల్ల కేవలం మంత్రుల ఇలాకాలో మాత్రమే కాంట్రాక్టు బిల్లులు చెల్లింపులు జరుగుతున్నాయని, మిగిలిన నియోజకవర్గాల్లో చిన్నపాటి పనులకు కూడా పైసలు రావడం లేదని ఆయన విమర్శించారు. అభివృద్ధి అంటే రాష్ట్రమంతా జరగాలని, కేవలం ఐదు లేదా ఆరు నియోజకవర్గాల అభివృద్ధిని చూసి మురిసిపోవడం సరికాదని హితవు పలికారు. పాలనలో పారదర్శకత ఉండాలని, ప్రతి నియోజకవర్గానికి సమాన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వివక్ష చూపడం వల్ల ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చే ప్రమాదం ఉందని ముందుగానే హెచ్చరించారు.



# కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఏమైంది?

**మొదటిపేజీ తరువాయి**



సభలో చర్చను పక్కదారి పట్టించేలా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంపై సభా సంఘం వేయాలని డిమాండ్ చేస్తూ స్పీకర్ పోడియంను చుట్టుముట్టారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని నినాదాలు చేయడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. తమపై వస్తున్న ఆరోపణల నుంచి తప్పించుకోవడానికే బీఆర్ఎస్ సభ్యులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని అధికార పక్షం కౌంటర్ ఇచ్చింది. స్పీకర్ వారించినా వినకుండా ప్రతిపక్ష సభ్యులు ఆందోళన కొనసాగించడంతో సభాపతి అసహనం వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ రెండు పార్టీలు బయటకు విమర్శలు చేసుకుంటున్నా, తెరవెనుక మాత్రం ఒక్కటేనని విమర్శించారు. కాళేశ్వరం విచారణలో జరుగుతున్న జాప్యానికి ఈ రహస్య మిత్రత్వమే కారణమని ఆయన విశ్లేషించారు. ఒకరి తప్పులను మరొకరు కప్పిపుచ్చుకుంటూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం విచారణ చేయకుండా కాలయాపన చేస్తూ, రాష్ట్రంలో రాజకీయ డ్రామాలు ఆడటం ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. విచారణ సంస్థలను రాజకీయ కక్షసాధింపులకు వాడుకోవడం మానుకోవాలని సూచించారు. రాష్ట్ర సంపదను కొల్లగొట్టిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. పాలనలో పారదర్శకతకు పెద్దపీట వేస్తామని, గత పదేళ్లలో జరిగిన ప్రతి అక్రమంపై నిగ్గు తేలుస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల పక్షాన నిలబడి నిర్ణయాలు తీసుకుంటోందని, విపక్షాల బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. హౌస్ కమిటీ ద్వారా ధరణి అక్రమాలను బయటపెట్టి, భూములు కోల్పోయిన రైతులకు తిరిగి భూములను అప్పగించే ప్రక్రియను వేగవంతం చేస్తామని చెప్పారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, ఎవరూ దానికి అతీతులు కారన్నారు. ప్రతిపక్షాల తీరు సభను అగౌరవపరిచేలా ఉందని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణాత్మకమైన చర్చల్లో పాల్గొనాల్సింది పోయి, కేవలం అరుపులు, కేకలతో సమయాన్ని వృధా చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల సొమ్ముతో నడిచే సభా సమయాన్ని వృధా చేయడం భావ్యం కాదని హితవు పలికారు. ఇప్పటికైనా విపక్షాలు తమ పద్ధతి మార్చుకోవాలని, చర్చకు వస్తే సమాధానం చెప్పడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. అభాండాలు వేయడం మాని, సాక్ష్యాధారాలతో మాట్లాడితే బాగుంటుందని సూచించారు. రాజకీయ ఉనికి కోసమే ప్రతిపక్షాలు పాకులాడుతున్నాయని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పార్టీలకు త్వరలోనే కాలం చెల్లుతుందని రేవంత్ రెడ్డి జోస్యం చెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ఏర్పడిన రాష్ట్రాన్ని గత ప్రభుత్వం దోచుకుందని, ఆ గాయాలను మాన్పడానికి తాము ప్రయత్నిస్తుంటే అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాల బాధ్యతను నాటి పాలకులు స్వీకరించాలని డిమాండ్ చేశారు. సాంకేతిక లోపాలతో డ్యామ్ దెబ్బతినడానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని పట్టుబట్టారు. ఈ విషయంలో కేంద్రం తన బాధ్యతను విస్మరిస్తే ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. శాసనసభలో జరిగిన ఈ చర్చలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి. ముఖ్యమంత్రి విసిరిన సవాల్‌పై బీజేపీ ఏ విధంగా స్పందిస్తుందోనన్న ఉత్కంఠ నెలకొంది. ధరణిపై హౌస్ కమిటీ ప్రకటనతో భూ అక్రమార్కుల్లో వణుకు మొదలైందనే ప్రచారం సాగుతోంది. అటు బీఆర్ఎస్ పార్టీ కూడా దూకుడు పెంచాలని భావిస్తుండటంతో రానున్న రోజుల్లో రాజకీయ పోరు మరింత ముదిరే అవకాశం కనిపిస్తోంది.

# అసెంబ్లీలో 'ధరణి' సెగ

**మొదటిపేజీ తరువాయి**

గత ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న పరిణామాలను ప్రస్తావిస్తూ భట్టి విక్రమార్క ప్రతిపక్షానికి గట్టి కౌంటర్ ఇచ్చారు. గత పదేళ్ల పాలనలో వివిధ అంశాలపై ఏర్పాటు చేసిన మూడు హౌస్ కమిటీల నివేదికలు ఏమయ్యాయని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఆనాడు కమిటీలను వేసి కాలయాపన చేశారే తప్ప, ఏనాడూ నివేదికలను సభ ముందు ఉంచలేదని గుర్తు చేశారు. ఇప్పుడు మాత్రం తమ ప్రభుత్వంపై బురద జల్లడమే లక్ష్యంగా విపక్షాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను అడ్డుకోవడంతో పాటు ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇది ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి నిదర్శనం కాదని స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వ్యవహరించడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైందని భట్టి ధ్వజమెత్తారు. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ధరణి పోర్టల్ అక్రమాలపై భట్టి విక్రమార్క సభలో కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పేరుతో వందలాది ఎకరాల భూములను అడ్డగోలుగా కట్టబెట్టారని ఆరోపించారు. రికార్డులను తారుమారు చేసి పేదల భూములను ధనవంతులకు, రాజకీయ నేతలకు కట్టబెట్టారని విమర్శించారు. ఈ భారీ భూ దోపిడీపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని, అందుకోసం తక్షణమే 'హౌస్ కమిటీ'ని ఏర్పాటు చేయాలని స్పీకర్‌కు విన్నవించారు. మైనింగ్ అక్రమాల విషయంలో తాము రాజీ పడబోమని, అడిగిన వెంటనే సీబీసీఐడీ విచారణకు ఆదేశించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. భూముల వ్యవహారంలో ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. శాసనసభలో చర్చ సాగుతుండగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తించిన తీరు తీవ్ర దుమారం రేపింది. సీనియర్ శాసనసభ్యుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి పట్ల ఆయన చేసిన వ్యాఖ్యలు, ప్రవర్తనపై మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్రంగా స్పందించారు. ఒక సీనియర్ సభ్యుడి పట్ల అగౌరవంగా నడుచుకోవడం సభా సంస్కృతికి విరుద్ధమని వారంతా ఏకగ్రీవంగా ఖండించారు. కౌశిక్ రెడ్డి వైఖరి కారణంగా సభలో కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రజాప్రతినిధులుగా ఉండి సభ్య సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని మంత్రులు ప్రశ్నించారు. పార్టీలకతీతంగా గౌరవించుకోవాల్సిన చోట వ్యక్తిగత దూషణలకు దిగడం రాజకీయ పతనావస్థకు నిదర్శనమని కాంగ్రెస్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.



సభలో గందరగోళం సృష్టించిన కౌశిక్ రెడ్డి వెంటనే కడియం శ్రీహరికి బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ సభ్యులు గట్టిగా డిమాండ్ చేశారు. సభ హుందాతనాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఊరుకోబోమని హెచ్చరించారు. క్షమాపణ చెప్పని పక్షంలో కౌశిక్ రెడ్డిని సభ నుంచి సస్పెండ్ చేయాలని స్పీకర్‌ను కోరారు. ఒకవైపు సభకు అడ్డు తగలడం, మరోవైపు తోటి సభ్యులను దూషించడం సరికాదని హితవు పలికారు. ప్రతిపక్ష సభ్యులు తమ తీరు మార్చుకోవాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని అధికార పక్షం హెచ్చరించింది. సభా నియమావళిని అతిక్రమించే ఎవరినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేస్తూ స్పీకర్ నిర్ణయం కోసం నిరీక్షించారు. శాసనసభలో గత రెండు రోజులుగా సాగుతున్న మాటల యుద్ధం రాష్ట్ర రాజకీయాల్లో వేడిని పెంచింది. అధికార పక్షం అక్రమాలను వెలికితీసే పనిలో ఉండగా, ప్రతిపక్షం ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగుతోంది. భూ అక్రమాలపై హౌస్ కమిటీ వేయాలని ఒకరు, మంత్రి చర్యలపై వివరణ ఇవ్వాలని మరొకరు పట్టుబట్టడంతో సభలో గందరగోళం నిరంతరాయంగా కొనసాగుతోంది. ఈ వాదోపవాదాల నడుమ ప్రజల అసలు సమస్యలు చర్చకు రావడం లేదన్న అసంతృప్తి వ్యక్తమవుతోంది. అసెంబ్లీ అనేది కేవలం రాజకీయ ఆరోపణలకు వేదిక కాకుండా, నిర్మాణాత్మక చర్చలకు అవకాశం ఉండాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇరు పక్షాలు పంతాలకు పోకుండా ప్రజా హితం కోసం సభను సజావుగా సాగనివ్వాలని సామాన్య ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రభుత్వ వ్యూహాలు ప్రతిపక్షాలను ఇరకాటంలో పడేసేలా ఉన్నాయి. ప్రత్యేకించి ధరణి అక్రమాలను సాక్ష్యాధారాలతో బయటపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. గతంలో జరిగిన తప్పులను ఎత్తిచూపుతూనే, తమ పారదర్శకతను నిరూపించుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. భట్టి విక్రమార్క చేసిన ఆరోపణలు కేవలం రాజకీయ కోణంలోనే కాకుండా, ప్రజల ఆస్తులను కాపాడాలనే సంకల్పంతో ఉన్నాయని అధికార పక్ష సభ్యులు సమర్థిస్తున్నారు. సీబీసీఐడీ విచారణలు, హౌస్ కమిటీల డిమాండ్లతో ప్రతిపక్షాన్ని ఆత్మరక్షణలో పడేసేందుకు ప్రభుత్వం పావులు కదుపుతోంది. దీంతో సభలో చర్చల కంటే సవాళ్లు, ప్రతిసవాళ్లే ఎక్కువగా వినిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఈ భూ అక్రమాల నివేదికలు ఎలాంటి సంచలనాలకు దారి తీస్తాయో అన్న ఉత్కంఠ నెలకొంది. రాజకీయాల్లో వారసత్వం, అనుభవం ఎంత ముఖ్యమో, ప్రవర్తన కూడా అంతకంటే ముఖ్యం. కడియం శ్రీహరి లాంటి సీనియర్ నేతపై జరిగిన దాడిని కేవలం వ్యక్తిగత విషయంగా చూడలేమని కాంగ్రెస్ శ్రేణులు అంటున్నాయి. ఇది ఒక వ్యవస్థపై జరిగిన దాడి అని, సభలో సభ్యుల రక్షణకు భంగం కలిగేలా ఉంటే స్పీకర్ కఠినంగా వ్యవహరించాలని వారు కోరుతున్నారు. ఎమ్మెల్యేల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా శిక్షించబడాలని డిమాండ్ చేస్తున్నారు. దీనివల్ల భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని భావిస్తున్నారు. సభలో చోటుచేసుకున్న ఈ అనూహ్య పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. సభా గందరగోళం నేపథ్యంలో ప్రభుత్వం తన పనితీరును సమర్థించుకుంటోంది. ప్రజాస్వామ్యయుతంగా చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ప్రతిపక్షమే పారిపోతోందని విమర్శిస్తోంది. అభివృద్ధి పనుల మీద చర్చించకుండా కేవలం కాంట్రాక్టుల అంశాన్ని పదే పదే ప్రస్తావిస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడుతోంది. భట్టి విక్రమార్క తన ప్రసంగంలో చెప్పినట్లుగా, ప్రభుత్వం తప్పు చేస్తే ప్రశ్నించే హక్కు ప్రతిపక్షానికి ఉంది కానీ, నిరాధారమైన ఆరోపణలతో సభను మూసివేయాలని చూడటం సరికాదు. ప్రజా సమస్యలపై పోరాడటం మాని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం సభను వేదికగా చేసుకోవడం ప్రతిపక్షానికే నష్టం కలిగిస్తుందని రాజకీయ పండితులు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ శాసనసభలో నెలకొన్న ఈ ఉద్రిక్తతలు ఇప్పుడప్పుడే తగ్గేలా కనిపించడం లేదు. ఇటు ప్రభుత్వం హౌస్ కమిటీల ఏర్పాటుపై వెనక్కి తగ్గడం లేదు, అటు ప్రతిపక్షం తన నిరసనను కొనసాగిస్తోంది. రాష్ట్రంలోని కీలకమైన భూ సమస్యలు, మైనింగ్ అక్రమాలపై నిజాలు నిగ్గు తేలాలంటే విచారణలు తప్పవని ప్రజలు భావిస్తున్నారు. అయితే సభలో జరుగుతున్న ఈ రచ్చ వల్ల అసలు విషయాలు పక్కదారి పడుతున్నాయి. అధికార, ప్రతిపక్ష నేతలు ఒకరిపై ఒకరు చేసుకుంటున్న ఘాటు విమర్శలు సోషల్ మీడియాలో కూడా పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి. ఈ తరం యువత ఈ రాజకీయ పరిణామాలను నిశితంగా గమనిస్తోంది, వారు కేవలం మాటల యుద్ధాన్ని కాకుండా ఫలితాలను ఆశిస్తున్నారు.

# అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి కమిటీ ఏర్పాటు



మోటకొండూర్, విశాలభారతి :మండలంలో మూతిరెడ్డి గూడెం గ్రామంలో డా. బి.ఆర్. అంబేద్కర్ గారి విగ్రహ నిర్మాణం కోసం గ్రామ పెద్దలు, యువత ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయడమైనది.ఈ కమిటీకి అధ్యక్షుడిగా ఉప సర్పంచ్ మంచాల వెంకన్నను ఎన్నుకోగా, ఉపాధ్యక్షులుగా దేవరాజు పోచయ్య, గంధమల్ల పాండు, కడమంచి బాలనర్సింహ్మా, నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా పన్నీరు భరత్, మంచాల మత్స్యగిరి వ్యవహరించనున్నారు. కార్యదర్శులు,ఆడెపు మహేందర్, ఆడెపు నరేష్, దేవరాజు మహేందర్ బాధ్యతలు చేపట్టగా, కోశాధికారిగా మంచాల సత్యనారాయణలను నియమించారు. కార్యవర్గ సభ్యులుగా గంధమల్ల ఉప్పలయ్య, ఆడెపు ఉపేందర్, మంచాల సుదర్శన్, దేవరాజు సిద్ధిరాములు, ఆడెపు శ్రీకాంత్, ఆడెపు స్వామి, చిట్టిగల్ల మహేందర్, కళ్లెం సుధాకర్, మంచాల సన్నీ కుమార్. గౌరవ సలహాదారులుగా ఆడెపు శ్రీనివాస్, గుజ్జుక మల్లేష్, గంధమల్ల నర్సింహ్మా, ఆడెపు సోములు, గుర్రాల నాగరాజు ముదిరాజ్ నియమించబడ్డారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలో త్వరలోనే అంబేద్కర్ గారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఆయన ఆశయాలను గ్రామ ప్రజల్లో విస్తరింపజేయడానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ నిర్మానానికి భూమిపూజ

**మోటకొండూర్, విశాలభారతి :** మండలం లోని ఇక్కుర్తిలో శ్చత్రపతి శివాజీ మహారాజ్ హిందూ సామ్రాట్ విగ్రహ నిర్మాణానికి భూమిపూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ చ్చత్రపతి శివాజీ మహారాజ్ గొప్పతనం ఛత్రపతి శివాజీ మహారాజు భారత చరిత్రలో అత్యంత ప్రతిభావంతుడైన,ధైర్యసాహసాల రాజుగా నిలిచారనీ అన్నారు. ఆయన గొప్పతనం హిందవి స్వరాజ్య స్థాపన శివాజీ మహారాజు "హిందు స్వరాజ్యం" అనే స్వప్నంతో ప్రజల ఆధారిత రాజ్యాన్ని నిర్మించారనీ తెలిపారు.గెరిల్లా యుద్ధ వ్యూహం ఆయన "గణిమి కవా" అనే గెరిల్లా యుద్ధ పద్ధతితో శత్రువులను మట్టికరిపించారనీ గుర్తు చేశారు. సమర్ధ పరిపాలన అష్టప్రధాన మండలి ఏర్పాటు చేసి వ్యవస్థీకృత పాలన సాగించారనీ చెప్పారు.ఆదాయ, న్యాయ, సైనిక వ్యవస్థలను క్రమబద్ధం చేశారనీ, సైనిక శక్తి, నౌకాదళం భూసేనతో పాటు శక్తివంతమైన నౌకాదళాన్ని ఏర్పాటు చేసి సముద్ర రక్షణకు ప్రాధాన్యం ఇచ్చారు అనీ వెల్లడించారు.మహిళలకు గౌరవం యుద్ధాల్లో పట్టుబడిన మహిళలను గౌరవంతో పంపించడం వంటి నిర్ణయాలతో మహిళా గౌరవాన్ని కాపాడారు అని అన్నారు. మత సామరస్యం అన్ని మతాలను గౌరవించి, ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించారని వివరించారు .శివాజీ మహారాజు ధైర్యం, న్యాయం, దేశభక్తి, ప్రజాస్వామ్య భావాలు ఆయనను యుగయుగాలపాటు స్ఫూర్తిదాయకుడిగా నిలబెట్టాయి. ఆయన జీవితం నాయకత్వం, స్వాభిమానం, దేశ సేవకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు.విగ్రహ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందుల చిరంజీవి, చిరుబోయిన మల్కయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.వార్డ్ సభ్యులు చిరుబోయిన నర్సింహులు, కందుల రమేష్ తదితరులు హాజరయ్యారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రాణాలు కాపాడుతున్న అత్యవసర వైద్య సేవలు



ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ 108 జనార్ధన్



నిజామాబాద్ జిల్లా సూపర్వైజర్ స్వరాజ్.108



ఈఎంటి లక్ష్మణ్ 108

**నిజామాబాద్, విశాలభారతి:**

108 అంబులెన్స్ సేవలు - ప్రాణాలను కాపాడుతున్న అత్యవసర వైద్య సేవలు నిజామాబాద్ జిల్లా ప్రజలకు 108 అంబులెన్స్ సేవలు అత్యవసర పరిస్థితుల్లో అండగా నిలుస్తూ, ప్రాణాలను రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 28 అంబులెన్స్ వాహనాలు 24 గంటలు అందుబాటులో ఉండి, ఎటువంటి ఆలస్యం లేకుండా సేవలు అందిస్తున్నాయి. ప్రమాదాలు, గర్భిణీ స్త్రీల అత్యవసరాలు, శ్వాస సమస్యలు, గుండెపోటు (కార్డియాక్), స్ట్రోక్ వంటి అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందిస్తూ ప్రజలకు సహాయం చేస్తున్నాయి. గత ఒక సంవత్సరం కాలంలో 108 సేవల ద్వారా మొత్తం 34,155 మంది రోగులకు అత్యవసర వైద్య సేవలు అందించబడ్డాయి. సమయానికి అంబులెన్స్ చేరుకోవడం వల్ల అనేక మంది ప్రాణాలు రక్షించబడ్డాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రతి ప్రాంతంలోనూ సేవలు సమర్థవంతంగా అందుతున్నాయి. ప్రోగ్రామ్ మేనేజర్.ఎన్. జనార్ధన్. మాట్లాడుతూ,ప్రతి కాల్‌ను అత్యవసరంగా పరిగణించి, సమయానికి స్పందించడం మా ప్రధాన లక్ష్యం. మా టీమ్ నిరంతరం అప్రమత్తంగా ఉండి ప్రజలకు సేవలు అందిస్తోంది" అని తెలిపారు. ఈఎంఈ స్వరాజ్. మాట్లాడుతూ, "108 అంబులెన్స్ సేవలు అనేవి ప్రజలకు జీవనరేఖలా మారాయి. గర్భిణీ స్త్రీల డెలివరీలు, ప్రమాద బాధితుల రక్షణ, గుండెపోటు. స్ట్రోక్ కేసుల్లో వేగవంతమైన స్పందన ద్వారా అనేక ప్రాణాలు కాపాడుతున్నాం. అని తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఎటువంటి సంకోచం లేకుండా 108 కు కాల్ చేసి సేవలను వినియోగించుకోవాలని అధికారులు కోరారు. సమయానికి ఇచ్చే సమాచారం, సరైన మార్గదర్శకంతో అంబులెన్స్ సేవలు మరింత వేగంగా చేరుకుని ప్రాణాలను రక్షించగలవని సూచించారు.నిజామాబాద్ జిల్లా 108 సేవలు ప్రజల విశ్వాసాన్ని పొందుతూ, నిరంతరం సేవల నాణ్యతను మెరుగుపరుచుకుంటూ ముందుకుసాగుతున్నాయి.అంబులెన్సుల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలు ఆక్సిజన్ సిస్టం, ఏఈడీ, సెక్షన్ యంత్రం, వార్మర్, లారింగోస్కోప్ వంటి అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. శిక్షణ పొందిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు నిరంతరం సేవలందిస్తున్నారు. జనార్ధన్ ప్రోగ్రాం మేనేజర్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా."ఈ కేర్ అంబులెన్స్లో అత్యాధునిక పరికరాలు ఉన్నాయి, ఏ సమయంలోనైనా సేవలందించేందుకు సిద్ధంగా ఉంటాం. అత్యవసర పరిస్థితుల్లోసకాలంలో ఆస్పత్రికి చేర్చి అనేక ప్రాణాలను కాపాడాం. ఈఎంటి లక్ష్మణ్ 108.

# తెలుగు దేశం జెండా ఆవిష్కరించిన సుంకరి వెంకటేష్



తెలుగు దేశం పార్టీ జెండా ఆవిష్కరించిన జిల్లా నాయకులు సుంకరి వెంకటేష్

## తెలుగు దేశం పార్టీ అంటేనే పేదల పార్టీ

**కీసర,విశాల భారతి :** తెలుగు దేశం పార్టీ ఆవిర్భవించి నేటికి 44 సంవత్సరాలు కావస్తున్న తరుణంలో ఆదివారం కీసర మండల కేంద్రంలో కీసరలో జిల్లా నాయకులు సుంకరి వెంకటేష్ ఆధ్వర్యంలో తెలుగు దేశం పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు.స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూవుల మాల వేసి అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించిన సుంకరి వెంకటేష్.ఈ సందర్భంగా సుంకరి వెంకటేష్ మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ ఆవిర్భవించి నేటి 44 సంవత్సరాలు అయింది అని అన్నారు.దేశ రాజధానిలో తెలుగోడి అవమానించారు అని నందమూరి తారక రామారావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే తెలుగు దేశం పార్టీ పెట్టిన కొన్ని నెలల్లోనే రాష్ట్ర ముఖ్యమంత్రి అయి అందరినీ ఆశ్చర్య పరిచారు.పెదాల పార్టీ అంటేనే తెలుగు దేశం పార్టీ అని గుర్తు చేశారు. ఎన్టీఆర్ ఆశయాలు ఆలోచనలు ఎల్లప్పుడూ నీరు పెదాలవైపే ఉండేవి అని అన్నారు.అసలు గ్రామాలల్లో ప్రతి ఒక్కరు చైత్యానం అయ్యారు అంటే తెలుగు దేశం పార్టీ కీలకం అని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు జంగయ్య చారి,చంద్రయ్య, దేవా చారి, జంగీర్ గౌడ్,శంకర్,జెపి రాజు తదితరులు పాల్గొన్నారు.

# శాసనసభలో సస్పెన్షన్ల పర్వం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు రాజకీయ ప్రకంపనల మధ్య కొనసాగుతున్నాయి. సభా కార్యకలాపాలకు పదేపదే విఘాతం కలిగిస్తున్నారనే కారణంతో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కఠిన చర్యలు తీసుకున్నారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మైనింగ్ వ్యవహారంలో హౌస్ కమిటీ వేయాలంటూ పట్టుబట్టిన గులాబీ ప్రజాప్రతినిధులు, స్పీకర్ పోడియం వద్దకు దూసుకెళ్లి నిరసన తెలపడం సభలో ఉద్రిక్తతకు దారితీసింది. శాసనసభ గౌరవ మర్యాదలను కాపాడటంతో పాటు బడ్జెట్ వంటి కీలక అంశాలపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని భావించిన ప్రభుత్వం, నిరసనకారులను సభ నుంచి పంపేయడమే సరైన మార్గమని నిర్ణయించింది. శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రతిపాదించిన సస్పెన్షన్ తీర్మానానికి సభ ఆమోదం తెలపడంతో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అత్యున్నత వేదికపై సభ్యులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ప్రతిపాదించిన బడ్జెట్‌పై లోతైన విశ్లేషణ, చర్చ జరగాల్సిన సమయంలో ప్రతిపక్షాలు కావాలనే రాద్ధాంతం చేస్తున్నాయని అధికార పక్షం ఆరోపించింది. ఈ నేపథ్యంలోనే ఆది, సోమవారాల పాటు అంటే ఈ బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సభ్యులను సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు కీలక సభ్యులు జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్ వంటి వారు ఉండటం గమనార్హం. సభ ప్రారంభమైనప్పటి నుంచే విపక్ష సభ్యులు తమ నిరసన గళాన్ని విన్పించారు. మైనింగ్ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ స్పీకర్ స్థానాన్ని చుట్టుముట్టారు. మార్షల్స్ రంగప్రవేశం చేసి సభ్యులను సముదాయించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో సభలో గందరగోళం నెలకొంది. చివరకు ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, లక్ష్మారెడ్డి, అనిల్ జాదవ్ వంటి వారు పోడియం ముందు బైఠాయించి నినాదాలు చేయడంతో సభాపతి అసహనం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన తెలిపే హక్కు ఉన్నప్పటికీ సభను స్తంభింపజేయడం ఆమోదయోగ్యం కాదని స్పీకర్ స్పష్టం చేశారు. కల్వకుంట్ల సంజయ్, కోవ లక్ష్మి, మహిపాల్ రెడ్డి సహా సుమారు 39 మంది సభ్యులను సభ నుంచి బయటకు పంపే ప్రక్రియ కొనసాగింది. దీంతో సభలో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ సభలో కీలకమైన బడ్జెట్ చర్చ జరగకుండా బీఆర్ఎస్ సభ్యులు అడ్డు తగలడం అత్యంత విచారకరమని విమర్శించారు. రైతులు, సామాన్యుల సమస్యలపై మాట్లాడకుండా రాజకీయ ప్రయోజనాల కోసం సభను వాడుకుంటున్నారని మండిపడ్డారు. సభ సమయం ఎంతో విలువైందని, పన్ను చెల్లింపుదారుల సొమ్ముతో నడిచే ఈ సమావేశాలను అర్థవంతంగా నిర్వహించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన గుర్తుచేశారు. నిరసనల పేరుతో కాలయాపన చేయడం వల్ల రాష్ట్ర అభివృద్ధి కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సస్పెన్షన్ జాబితాలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి వంటి మహిళా నేతలు కూడా ఉన్నారు. ప్రశాంత్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి వంటి వారు వరుసగా నినాదాలు చేస్తూ సభ నియమావళిని ఉల్లంఘించారని అధికార పక్షం ఆరోపించింది. తలసాని శ్రీనివాస్ యాదవ్, కాలేరు వేంకటేశ్, విజయుడు, కేపీ వివేకానంద తదితరులు మార్షల్స్‌తో వాగ్వివాదానికి దిగడం అక్కడ ఉద్రిక్తతను పెంచింది. స్పీకర్ ఆదేశాల మేరకు వారందరినీ సభ నుంచి పంపించివేశారు. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రవర్తనపై సభలో తీవ్ర చర్చ నడిచింది. మాజీ మంత్రి, అత్యంత సీనియర్ సభ్యుడైన కడియం శ్రీహరి పట్ల కౌశిక్ రెడ్డి అనుచితంగా వ్యవహరించడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. శాసనసభలో సీనియర్లకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ఆయన ప్రశ్నించారు. ఒక ప్రజాప్రతినిధిగా హుందాతనాన్ని మరిచి ప్రవర్తించిన తీరుపై విచారణ జరిపించాలని కోరారు. కౌశిక్ రెడ్డి వ్యవహారశైలిపై ఎథిక్స్ కమిటీ ద్వారా లోతైన విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు సీఎం సూచించారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు ఎథిక్స్ కమిటీ విచారణ కోరుతూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఒక సభ్యుడు పదేపదే సభా సంప్రదాయాలను తుంగలో తొక్కుతూ తోటి సభ్యులను కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్యానికి చేటని ప్రభుత్వం వాదించింది. ఒకవేళ కౌశిక్ రెడ్డి తన తీరును మార్చుకోకపోతే ప్రస్తుత బడ్జెట్ సమావేశాల నుంచి పూర్తిగా బహిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డి గట్టిగా కోరారు. సభలో క్రమశిక్షణను కాపాడటం కోసం ఇలాంటి కఠిన నిర్ణయాలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. సభా తీర్మానాన్ని పరిగణనలోకి తీసుకున్న స్పీకర్ గడ్డం ప్రసాద్, పాడి కౌశిక్ రెడ్డి అంశాన్ని తక్షణమే ఎథిక్స్ కమిటీకి అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. కమిటీ తన నివేదికను సమర్పించిన తర్వాత దాని ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ఆయన ప్రకటించారు. సభలో ఎవరూ చట్టానికి, నియమాలకు అతీతులు కారని ఆయన నొక్కి చెప్పారు. సభ్యుల వ్యక్తిత్వ హననానికి పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ నిర్ణయంతో బీఆర్ఎస్ శ్రేణులు నిరసనలకు దిగగా, అధికార పక్షం మాత్రం సభ హుందాతనాన్ని కాపాడామని సమర్థించుకుంది. బడ్జెట్ సమావేశాల ముగింపు దశలో జరిగిన ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్నందుకే తమను సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. సభలో మెజారిటీ ఉందని నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారని విపక్ష నేతలు విమర్శిస్తున్నారు. ప్రతిపక్షం లేని సభలో తమకు నచ్చిన విధంగా బడ్జెట్‌ను ఆమోదింపజేసుకోవాలనే కుట్రలో భాగమే ఈ సస్పెన్షన్లని వారు మండిపడుతున్నారు. అసెంబ్లీ ప్రాంగణంలోనే వారు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# సరదా క్షణం... శాశ్వత విషాదంగా మారింది

- నీటి మడుగులో మునిగి ఇద్దరు చిన్నారుల మృతి – సత్తుపల్లిలో విషాదం
- ఈత కొట్టేందుకు వెళ్లి మడుగులో మునిగిన ఇద్దరు బాలురు
- లోతు తెలియక ప్రమాదం – ప్రాణాలు కోల్పోయిన చిన్నారులు
- ఎంటీఆర్ నగర్‌లో విషాద ఛాయలు – కుటుంబాల్లో ఆవేదన





**సత్తుపల్లి, విశాలభారతి:** సత్తుపల్లి పట్టణంలోని ఎంటీఆర్ నగర్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. సరదాగా బయటకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు సమీపంలోని నీటి మడుగులో మునిగి ప్రాణాలు కోల్పోయారు. మృతులు వంగూరి నాగబాబు (12), వంటిపులి దేవ (12)గా గుర్తించారు. వీరు ఆటపాటల కోసం బయటకు వెళ్లి, సమీపంలోని నీటి మడుగులో ఈత కొట్టేందుకు దిగారు. అయితే మడుగులో లోతు ఎక్కువగా ఉండటంతో ఇద్దరూ మునిగిపోయారు. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే వారిని బయటకు తీయడానికి ప్రయత్నించినప్పటికీ, అప్పటికే చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో ఎంటీఆర్ నగర్‌లో విషాద వాతావరణం నెలకొంది. చిన్నారుల మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సరదాగా గడపాల్సిన క్షణం శాశ్వత విషాదంగా మారడంతో గ్రామం మొత్తం శోకసంద్రంగా మారింది.

## రామ భక్తులకు కెనరా బ్యాంక్ తాగునీటి బాటిళ్ల అందజేత



**మేనేజర్ బి. శ్రీనివాసరావు**

**అశ్వాపురం, విశాల భారతి :** శ్రీరామ నవమి సందర్భంగా రామ భక్తులకు భద్రాచలం కెనరా బ్యాంక్ శాఖ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేసినట్లు ఆ శాఖ బ్యాంక్ మేనేజర్ బి. శ్రీనివాస్ రావు తెలిపారు. భద్రాచలంలోని లోకపావనుడైన శ్రీరామచంద్రుని తిరుకల్యాణ మహోత్సవం సందర్భంగా కెనరా బ్యాంక్ భద్రాచలం శాఖవారు సామాజిక బాధ్యతగా తీసుకొని (సి ఎస్ ఆర్) కింద భక్తులకు సేవలందించిందన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, స్వామివారి దర్శనానికి వచ్చే వేలాది మంది భక్తుల సౌకర్యార్థం రూ. 50 వేల విలువైన మినరల్ వాటర్ బాటిళ్లను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. శ్రీరాముడు జగత్ కళ్యాణం లో కెనరా బ్యాంక్ ద్వారా సేవలందించే అవకాశం రావడం సంతోషంగా ఉందని మేనేజర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు నీటి బాటిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## మణుగూరులో లాన్ టెన్నిస్ కోర్టు ఏర్పాటు చేయాలి

**సిఐటియు**



**మణుగూరు, విశాలభారతి :** మణుగూరు ఏరియాలో క్రీడలను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా లాన్ టెన్నిస్ కోర్టు ఏర్పాటు చేయాలని కార్యదర్శి వల్లూరు వెంకటరత్నం యాజమాన్యాన్ని కోరారు. ఆదివారం నాడు, సిఐటియు కార్యాలయంలో లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు, మణుగూరు ఏరియా నుండి లాన్ టెన్నిస్ లో కోల్ ఇండియా స్థాయిలో మూడు బంగారు పతకాలు సాధించిన కార్మికులను అభినందిస్తూ మరింత మంది క్రీడాకారులను తీర్చిదిద్దుటకు మణుగూరు లోనే సౌకర్యాలు కల్పించాలని అన్నారు. గోల్డ్ మెడల్ సాధించిన కార్మికులు అనేక ఇబ్బందులు పడుతూ ప్రతి రోజు పాల్వంచ వెళ్లి సాధన చేసి సింగరేణికి మణుగూరు ఏరియా కి మంచి పేరు తెచ్చారని తెలిపారు. ఇప్పటికైనా యాజమాన్యం సరైన వసతులు ఏర్పాటు చేసి కార్మికులను ఉత్తమ క్రీడాకారులుగా తయారు చేయాలని కోరారు. ఈ సమావేశంలో విల్సన్ రాజు, సాయి కృష్ణ, ముజఫర్, సుమన్, రాంబాబు, సాంబశివరావు, రామకృష్ణ, బుచ్చిరెడ్డి, శ్రీకాంత్, బిక్షపతి, సతీష్, తిరుపతి, విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన సీనియర్ న్యాయవాది

- చలకాని వెంకట్ యాదవ్‌కు ఘన సన్మానం



**ఆలేరు, విశాల భారతి :** హైకోర్టు అడ్వకేట్, హైకోర్టు మాజీ ప్రభుత్వ ప్లీడర్, సీనియర్ న్యాయవాది, పేదల పక్షపాతి, న్యాయం కోసం పోరాడే ప్రజల మనిషిగా పేరుగాంచిన చలకాని వెంకట్ యాదవ్ రాష్ట్ర హైకోర్టు బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా ప్రేమ సేవాసదనం స్వచ్ఛంద సేవ సంస్థ, ఆలేరు ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ లో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేసి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. న్యాయం కోసం నిరంతరం కృషి చేస్తూ తన సేవా నిబద్ధతను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రేమ సేవాసదనం ఫౌండర్, ఆలేరు మాజీ సర్పంచ్ ఆకవరం మోహన్ రావు, డైరెక్టర్ మహమ్మద్ ఖుర్షిద్ పాషా, దూడం మధు, చెక్క పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు



**ఆర్మూర్, విశాలభారతి:** నందిపేట్ మండలంలోని వెల్మల్ సిఎస్ఐ చర్చిలో ఆదివారం జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గాదారి గోపి మట్టల ఆదివారం ను పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. గాదారి గోపిని సంఘ కాపరి, సంఘ పెద్దలు ఘనంగా శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సిఎస్ఐ చర్చి మౌలిక సదుపాయాల కోసం తన వంతుగా లక్ష రూపాయలు విరాళంగా అందజేస్తామని హామీ ఇచ్చారు. రాబోయే దినాలలో చర్చి అభివృద్ధి కొరకు కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి సహకారంతో మరిన్ని నిధులు వచ్చేలా కృషి చేస్తానని సంఘం సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముత్యం, మల్లేష్, వార్డురాజేందర్ , సంతోష్, సంఘ సభ్యులు శుభా కర్, అబ్రహం, సదానందం, కిసాన్, నరసయ్య, దేవానందం తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల స్వైరవిహారం



**విశాలభారతి:** పోతంగల్ మండలం కల్లూరు గ్రామంలో ఈరోజు తెల్లవారుజామున 4:30 గంటల ప్రాంతంలో పిచ్చి కుక్కలు స్వైరవిహారం చేశాయి. ఒక్కసారిగా విరుచుకుపడిన కుక్కల దాడిలో ఇద్దరు మహిళలతో పాటు 10 ఏళ్ల బాబు, 32 ఏళ్ల వ్యక్తికి మరియు మరికొన్ని పశువులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనతో గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. గ్రామంలో కుక్కల బెడద విపరీతంగా పెరిగిపోయిందని, బయటకు రావాలంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి, కుక్కల నుండి తమకు రక్షణ కల్పించాలని కల్లూరు గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఘనంగా టీడీపీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు






విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ : తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని లెక్చరర్స్ కాలనీ, హయత్‌నగర్, హైకోర్టు కాలనీ డివిజన్లలో ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు తెలంగాణ తెలుగు యువత మాజీ అధికార ప్రతినిధి, మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గ అదహక్ కమిటీ సభ్యులు సింగిరెడ్డి మురళీధర్ రెడ్డి, నక్క రంజిత్ గౌడ్ లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించి, మిఠాయిలు పంచుతూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి మురళీధర్ రెడ్డి, నక్క రంజిత్ గౌడ్ మాట్లాడుతూ.. స్వర్గీయ నందమూరి తారక రామారావు 1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీని స్థాపించి తక్కువ కాలంలోనే అధికారంలోకి తీసుకువచ్చి తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని గుర్తు చేశారు. అనగారిన వర్గాలకు రాజకీయంగా అవకాశాలు కల్పించడం, మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు, వృద్ధులకు పింఛన్లు, రెండు రూపాయల కిలో బియ్యం వంటి పథకాలతో ప్రజల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉందన్నారు. అలాగే పటేల్‌పట్వారి వ్యవస్థను రద్దు చేసి, మండల వ్యవస్థను తీసుకువచ్చి పరిపాలనను ప్రజలకు దగ్గర చేయడం, హైటెక్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్, విమానాశ్రయం వంటి మౌలిక వసతుల అభివృద్ధిలో టీడీపీ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు మరాఠి బిక్షపతి, మన్సూరాబాద్ అధ్యక్షులు దుర్గం మల్లేష్ యాదవ్, ఎల్‌బీనగర్ తెలుగు యువత అధ్యక్షులు కాటిపాక ప్రవీణ్ కుమార్, జనగ మహేందర్, నందమూరి శ్రీనివాస్ చౌదరి, జై భరత్ రెడ్డి, సత్యనారాయణ గౌడ్, అశోక్ కరణ్ చౌదరి, నరసింహ యాదవ్, కుమార్ యాదవ్, మోహన్ గౌడ్, జనార్ధన్ గుప్తా, విజయ్ గౌడ్, శివ నాయక్, అర్జున్, సాహిత్ కొమెర్ల, రంజిత్, శివా నాయక్, కార్యకర్తలు, పెద్ద ఎత్తున హాజరై నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మగౌరవ నినాదానికి 44 వసంతాలు



**మణుగూరు, విశాలభారతి :** మండల కేంద్రంలోని టీడీపీ సెంటర్, సమితి సింగారం పంచాయతీ ఆఫీస్ ఏరియా, ఎం ఆర్ ఓ ఆఫీస్ ఏరియా, పూల మార్కెట్ ఏరియాలో టిడిపి పార్టీ 44వ ఆవిర్భావం దినోత్సవ సందర్భంగా ఆదివారం నాడు నియోజకవర్గ టీడీపీ హడక్ కమిటీ సభ్యులు వట్టం నారాయణ దొర, వాసిరెడ్డి చలపతి రావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు అన్న నందమూరి తారక రామారావు 1982లో స్థాపించిన తెలుగుదేశం పార్టీ, నేడు నాలుగు దశాబ్దాలుగా ప్రజల సేవలో అహర్నిశలు కృషి చేస్తూ ముందుకు సాగుతోంది అన్నారు. తెలుగుదేశం పార్టీ పుట్టుక ఒక రాజకీయ సంఘటన మాత్రమే కాదు, అది తెలుగు ప్రజల ఆత్మగౌరవ ఉద్యమానికి నాంది అని తెలిపారు. రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలతో తెలుగుదేశం పార్టీ ఎప్పటికప్పుడు ప్రజల పక్షాన నిలుస్తూ వచ్చింది. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, పారదర్శక పాలన, సుస్థిర అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తోంది అని వారు తెలిపారు. ఈ స్థాపన దినోత్సవం సందర్భంగా పార్టీ శ్రేణులు మహానేత ఎన్టీఆర్ ఆశయాలను స్మరించుకుంటూ, ప్రజలకు మరింత దగ్గరగా ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం పని చేయాలని సంకల్పించాయి. రాబోయే రోజుల్లో కూడా ప్రజల ఆశయాలకు అనుగుణంగా పార్టీ అంకితభావంతో సేవలు అందిస్తుంది అని పార్టీ హడాక్ కమిటి సభ్యులు వాసిరెడ్డి చలపతి రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బచ్చల భారతీ, పట్టణ అధ్యక్షులు ఎలమాటి పూర్ణచంద్రరావు పార్టీ సీనియర్ నాయకులు ఉప్పలపాటి రాంబాబు, పట్టణ కోశాధికారి ముసునూరి చందర్ రావు, మండల ప్రధాన కార్యదర్శి మద్దెల భద్రయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి బొల్ల ఆంజనేయులు, యార్లగడ్డ రాజా, చావా రామరావు, ముమ్మనేని సత్యనారాయణ, దండమూడి రాంబాబు, దర్పునేని హరి, చిర్ర రవికుమార్, తాత రామయ్య, మేదరమెట్ల నాగేశ్వరరావు, గుండా రామచందర్ రావు, ఎగ్గడి మల్లయ్య, సుగిల్ల సూరి బాబు, బచ్చల సుమేష్, కడియాల సాగర్, ధారావత్ వీరన్న, అజ్మీరా బావూ సింగ్, రాజు, చందమల్ల అమర్, మహిళ నాయకురాలు చావా శ్రీదేవీ, పురిటి విజయలక్ష్మి, అలివేలు మరియు పట్టణ వ్యాపారస్తులు, అన్న అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

- గుంజాల భాస్కర్ రెడ్డి



**అదిలాబాద్ , విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు గుంజాల భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోనాల మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో 2001 నుండి 2014 వరకు చురుకుగా పాల్గొని, రాష్ట్ర సాధన కోసం అనేక కష్టాలు పడినట్లు ఆయన తెలిపారు. ఆ సమయంలో అనేక కేసులు ఎదుర్కొని, సంవత్సరాల పాటు కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా తీవ్ర నష్టపోయామని పేర్కొన్నారు. అయినప్పటికీ ఇప్పటికీ ప్రభుత్వం తమ సమస్యలపై దృష్టి సారించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని, ఉద్యమకారులకు నెలకు రూ.25,000 పెన్షన్‌తో పాటు ఇంటి స్థలం కేటాయించి గౌరవించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సోనాల మండల నూతన అధ్యక్షుడు రామాయి, ప్రధాన కార్యదర్శి సదానందం, ఉపాధ్యక్షులు లోలపు పోశెట్టి, షేక్ మహమ్మద్, చిలుకూరి నరేందర్, భీంరావు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచానికి మోడీ ఆదర్శం



**సికింద్రాబాద్, విశాలభారతి :** నరేంద్ర మోడీ మన్ కీ బాత్ కార్యక్రమం పార్సిగుట్ట, అశోక్ నగర్లో బిజెపి సీనియర్ నాయకుడు నియోజవర్గం జాయింట్ కన్వీనర్ సాయి దత్తు నివాసంలో వీక్షించడం జరిగింది. దేశం కోసం యువత కోసం మహిళల కోసం భారత ప్రభుత్వం నరేంద్ర మోడీ నాయకత్వంలో చేసే అభివృద్ధి కార్యక్రమం ప్రజలు అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యంపై నరేంద్ర మోడీ ప్రసంగించడం జరిగింది. యువత మహిళలు అనేక వర్గాల ప్రజలు తమ కాళ్లపై వారు నిలబడి వారి జీవనం కొనసాగించే విధంగా స్వయం సహాయ కార్యక్రమాలు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి, సాయి దత్తు, హనుమంతు ముదిరాజ్, మేకల కీర్తి హర్ష కిరణ్, బైరి అమరావతి, సురేష్, బిక్షపతి, శ్రీనివాస్ రావు, రాములు, శ్రీనివాస్ రెడ్డి ,స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఈ కార్యక్రమాన్ని వీక్షించడం జరిగింది, అనంతరం మేకల సారంగపాణి మాట్లాడుతూ కార్యకర్తల అందరం కలిసిమెలిసి ప్రజావ్యతిరేకమైన కాంగ్రెస్ ప్రభుత్వం, బీ ఆర్ఎస్ ఎమ్మెల్యే పైన పోరాటం చేయాలని ప్రజలకు వాస్తవాలు తెలియజేసి నరేంద్ర మోడీ చేసే అభివృద్ధి కార్యక్రమాలపైనే సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించి తెలంగాణలో బిజెపి ప్రభుత్వం అధికారంలో తీసుకురావడానికి బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలని నాయకులను దర్శించి మాట్లాడడం జరిగింది. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎలక్షన్ లో పార్టీ విజయం పైన అందరూ దృష్టి పెట్టాలని మేకల సారంగ పాణి అన్నారు.

## ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**సికింద్రాబాద్, విశాలభారతి :** తెలుగుదేశంపార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వారాసిగూడ కూడలిలో తెదేపా బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ కుమార్ విచ్చేసి తెలుగుదేశం పార్టీ జెండాని ఎగురవేశారు అనంతరం కేక్ ని కట్ చేసి పంచిపెట్టారు ఈసందర్భంగా వల్లారపుశ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగువారి కీర్తి ప్రతిష్టల్ని ప్రపంచం నలుమూలల చాటిచెప్పిన ఘనత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావుకే దక్కుతుందని అన్నారు. పెద, బడుగు, బలహీన వర్గాలే కాకుండా ఆడపడుచులకు అణగారిన వర్గాలకు కార్మిక కర్షక కర్షక వర్గాల అభ్యున్నతికోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం అని కొనియాడారు. అభివృద్ధికి మారుపేరు తెలుగుదేశంపార్టీ అని అన్నారు . కార్యక్రమంలో సీనియర్ నాయకులు పరిటాల విజయ్ కుమార్, వెంకట స్వామి, పొట్టి శీను పిట్ల శంకర్ ముదిరాజ్, చిరంజీవిరాజు, శేషిరెఖ,జి ఎం రమేష్, చంద్రమోహన్, మురళీకృష్ణ, నాయుడు, రాజు, టెంట్ హౌస్ శంకర్, జగదీష్, సుధాకర్, శ్రీనుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్లెం నవజీవన్ రెడ్డికి ఘన సన్మానం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆంధ్ర బ్యాంక్ ఎంక్లవ్ కాలనీవాసులు హయత్‌నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. కాలనీ అభివృద్ధికి ఆయన అందించిన సేవలను గుర్తిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. డ్రైనేజీ, రోడ్లు, మంచినీటి సమస్యల పరిష్కారం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కళ్లెం నవజీవన్ రెడ్డి చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ అందుబాటులో ఉండడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. ఇలాంటి నాయకత్వం కాలనీ అభివృద్ధికి ఎంతో అవసరమని, భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. స్పందించిన కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. కాలనీవాసులు చూపిన ప్రేమాభిమానాలు తనపై బాధ్యతను మరింత పెంచాయని తెలిపారు. కాలనీ అభివృద్ధిని తన కర్తవ్యంగా భావించి ఎల్లప్పుడూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజల విశ్వాసమే తనకు ప్రేరణగా నిలుస్తుందని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు జయశంకర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు సుమన్, జాన్ రెడ్డి, బాల్‌రాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బహుజన రాజ్యాధికారమే లక్ష్యం

- బాబు జగ్జీవన్ రామ్ వ్యవస్థాపక అధ్యక్షులు రాంబాబు
- బహుజనగళం గోడపత్రిక ఆవిష్కరణ



**పాల్వంచ, విశాలభారతి:** బహుజనులకు రాజ్యాధికారం దక్కినప్పుడే నిమ్నవర్గాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జగ్జీవన్ రామ్ వారసుల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు వానపాకుల రాంబాబు పేర్కొన్నారు. ఆదివారం ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఐక్యవేదిక నాయకులతో కలిసి రాంబాబు మాట్లాడారు. ఏప్రియల్ 10న కొమరం భీమ్ హాల్ ప్రాంగణంలో బహుజన గళం పాటల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం నగరపాలక సంస్థ మేయర్ మూడు గణేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె షాబీర్ పాషాలు పాల్గొంటారని తెలిపారు. తెలంగాణ కళాకారులు పాటమ్మ రాంబాబు, చుక్కా రామ్ నర్సయ్య, తమ్మి రవి లచే ధూంధాం కార్యక్రమం ఉంటుందన్నారు. తొలుత బహుజన గళం గోడపత్రిక ఆవిష్కరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మల్లేష్, ఉపాధ్యక్షులు సురేందర్, వంగలపూడి శ్రీను, మహిళా నాయకురాలు పుష్ప, వెంకటయ్య, చరణ్, భరత్ చంద్ర, మణి తదితరులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచ్ ఆధ్వర్యంలో నూతన విద్యుత్ లైన్ ప్రారంభం



**బూర్గంపాడు, విశాలభారతి:** బూర్గంపహడ్ మండలం గౌతమిపురం లోఓల్టేజ్ సమస్యతో ఆ కాలనీవాసులు గతకొంత కాలంగా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో అట్టి సమస్యను దృష్టిలో పెట్టుకొని నూతన ట్రాన్స్ఫార్మర్ ను విద్యుత్ అధికారులు ఏర్పాటు చేసి ఉపసర్పంచ్ గుండె వెంకన్న ఆధ్వర్యంలో ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో బూర్గంపహడ్ విద్యుత్ కార్యాలయం అధికారులు, ఫోర్మెన్ ఆదినారాయణ, లైన్ మెన్ జిలానీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్ నిశ్చితార్థం

**హాజరైన మన భద్రాద్రి, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వెల్ఫేర్ సొసైటీ**

**నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎడారి రమేష్ బృందం**




**బూర్గంపాడు, విశాలభారతి:** సారపాక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాంనాయక్ నిశ్చితార్థం ఆదివారం పాల్వంచ సుగుణ ఫంక్షన్ హాల్లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మన భద్రాద్రి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వెల్ఫేర్ సొసైటీ మిత్రులు అధ్యక్షుడు ఎడారి రమేష్ ప్రజావాయిస్ రిపోర్టర్ తో పాటు బర్ల ప్రభాకర్ విశాలభారతి, శివరాం తెలంగాణం న్యూస్ లైన్, రాజశేఖర్ ప్రజాగర్జన, రాంప్రసాద్ టీవీ 3. హాజరై నూతన వధూవరులను శతమానంభవతి అని ఆశీర్వదించారు. అదేవిధంగా మండలంలోని వివిధ పార్టీల నాయకులు అభిమానులు భారీ సంఖ్యలో విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు.



# ‘కల్కి 2’ షూటింగ్‌లో భైరవ ఎంట్రీ ఎప్పుడు..

పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సీక్వెల్ చిత్రాల్లో కల్కి 2 ఒకటి. ప్రభాస్ హీరోగా, దర్శకుడు నాగ్ అశ్విన్ రూపొందిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ ఇప్పటికే షూటింగ్ దశలో వేగంగా ముందుకెళుతుంది. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఈ సినిమాలో బాలీవుడ్ దిగ్గజాలు అమితాబ్ బచ్చన్, లోకనాయకుడు కమల్ హాసన్ ఇప్పటికే షూటింగ్‌లో పాల్గొన్నట్టు సమాచారం. వీరి సీన్స్ పూర్తి అయిన తర్వాత ఇప్పుడు అందరి దృష్టి ప్రభాస్ ఎప్పుడు సెట్స్‌లోకి అడుగుపెడతాడన్న దానిపై నిలిచింది. తాజా సమాచారం ప్రకారం, ‘డార్లింగ్’ ప్రభాస్ ఏప్రిల్ 10 నుంచి షూటింగ్‌లో జాయిన్ కాబోతున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఆయన పాత్ర ‘భైరవ’కు సంబంధించిన కీలక సన్నివేశాలు ఈ షెడ్యూల్‌లో తెరకెక్కించనున్నారు. ఈ షెడ్యూల్ ఎన్ని రోజులు కొనసాగుతుందో మాత్రం ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.ఇక ప్రభాస్ ప్రస్తుతం ఇతర ప్రాజెక్టులతో కూడా బిజీగా ఉన్నాడు. దర్శకుడు హను రాఘవపూడి, అలాగే సందీప్ రెడ్డి వంగా దర్శకత్వాల్లో తెరకెక్కుతున్న చిత్రాల్లో ఆయన నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టుల మధ్య సమన్వయం చేసుకుంటూ ‘కల్కి 2’ షూటింగ్ పూర్తి చేయాల్సి ఉంది. భారీ బడ్జెట్, స్టార్ కాస్ట్, విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందుతున్న ఈ సైన్స్ ఫిక్షన్ ఎపిక్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదటి భాగం సృష్టించిన హైప్‌ను మించి సీక్వెల్ ఉండబోతుందనే నమ్మకంతో అభిమానులు ఎదురుచూస్తున్నారు. ప్రభాస్ పూర్తి స్థాయిలో షూటింగ్‌లోకి ఎంటర్ అయిన తర్వాత ‘కల్కి 2’ మరింత వేగం అందుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.